క్లుప్తంగా

సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ పోటీలకు కేబీఎన్ విద్యార్థినులు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తమిళనాడు రాష్ట్రం సేలంలోని పెరియార్ యూనివర్సిటీలో త్వరలో జరగబోయే దక్షిణ భారత అంతర్ విశ్వ విద్యాలయాల మహిళా హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొనేందుకు తమ కళాశాల విద్యార్థినుల బృందం కృష్ణా యూనివర్సిటీ తరఫున ఎంపికైందని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తెలిపారు. ఇటీవల జరిగిన విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీలలో తమ కళాశాల జట్టు విశేష ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ జట్టులో పాల్గొన్న తమ విద్యార్థినులు బి.లోకేశ్వరి, వి.సుప్రియ, సీహెచ్ ద్వారకేశ్వరి, టి.అరుణ నాగదుర్గ, బి.సత్య, జి.మానస, ఎస్కే నాగూర్‌బీ సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. క్రీడాకారులను కళాశాల సెక్రటరీ టి.శ్రీనివాసు, హిందూ హైస్కూల్ కమిటీ ఏవో ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు అభినందించినట్లు పేర్కొన్నారు.

టయోటా 'న్యూ క్యామ్రీ' వాహన శ్రేణి ఆవిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): టయోటా కిర్లోస్కర్ మోటార్ వాహనాల అధీకృత డీలర్ అయిన పృథ్వీ టయోటా గొల్లపూడి షోరూమ్‌లో టయోటా 'న్యూ క్యామ్రీ' వాహన శ్రేణి ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పృథ్వీ టయోటా సీఈఓ పి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ టయోటా కొత్త న్యూ క్యామ్రీలో 2.5 లీటర్, 4 సిలెండర్ ఇంజన్ ఉంటుదని, అది గరిష్టంగా 222 బీహెచ్‌పీ శక్తిని, 221 ఎన్‌ఎం టార్క్ ఉత్పత్తిని అందిస్తుందని తెలిపారు. లీటర్‌కు 25 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని అన్నారు. ఇందులో స్పోర్ట్స్ ఎకో, నార్మల్ అనే మూడు డ్రైవింగ్ మోడ్లు ఉన్నాయన్నారు. టయోటా న్యూ క్యామ్రీ 6 కలర్ ఆప్షన్లలో లభిస్తుందని చెప్పారు. ఏడీఏఎస్, 10 అంగుళాల డిస్‌ప్లే, 360 డిగ్రీల కెమెరా కలిగి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పృథ్వీ టయోటా కిర్లోస్కర్ మోటార్స్ ఫీల్డ్ మేనేజర్ చేమన్ శర్మ నవల, ఎండీ పృథ్వీ చంద్ర, జీఎం భాను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా రవీంద్ర భారతి చిన్నారుల స్నాతకోత్సవం



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రవీంద్ర భారతి భవానీపురం పీఆర్‌కే బిల్డింగ్ బ్రాంచిలో యూకేజీ విద్యార్థుల కాన్వొకేషన్ వేడుకలు సందడిగా జరిగాయి. కార్యక్రమానికి డాక్టర్ యక్కల వెంకట సతీష్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కాన్వొకేషన్ దుస్తుల్లో తమ చిన్నారులను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో రవీంద్ర భారతి విద్యా సంస్థల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, డైరెక్టర్ వీరమాచనేని శాంతి, ప్రిన్సిపాల్ జ్యోతి శైలజ, క్యాంపస్ ఇన్‌చార్జ్ ప్రభాకర్ బాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐఓటీతో విస్తృత ఉపాధి అవకాశాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఐఓటీతో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని డాక్టర్ సర్దార్ పటేల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అకడమిక్స్ అండ్ రీసెర్చ్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు అన్నారు. కేబీఎన్ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం 'ఐఓటీ టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల తరగతి గదులలోని స్మార్ట్ బ్లాక్‌బోర్డుల నుంచి పార్కిన్సన్స్ వ్యాధి సంకేతాలను గుర్తించగల వైద్య పరికరాల వరకు ఐఓటీ అనుసంధాన వ్యవస్థ అవసరమవుతోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి. నారాయణరావు, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఆర్.ఉదయ్ కుమార్, అధ్యాపకురాలు బి.శృతి పాల్గొన్నారు.

మాటలు తప్ప చేతలు శూన్యం..!

- కేఎల్‌రావు పార్కులో నత్తనడకన అభివృద్ధి పనులు
- నాడు థీమ్ పార్కు! నేడు యాంపీ థియేటర్!
- కమిషనర్ మారిన ప్రతిసారీ ఆర్భాటంగా ప్రకటనలు
- రెండేళ్లుగా పశ్చిమ ప్రజలకు అందుబాటులో లేని పార్కు



బోటింగ్ లేక వెలవెలపోతున్న పార్కు



కేఎల్ రావు పార్కు ముఖద్వారం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్ రావు పార్కును థీమ్ పార్కుగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని గత ఏడాది అప్పటి కార్పొరేషన్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ ప్రకటించారు. పార్కు అభివృద్ధికి సుమారు రూ.2 కోట్ల మేర నిధులు వెచ్చించారు. కోటి వ్యయంతో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టడంతో పాటు పార్కులో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో కేఎల్‌రావు పార్కు నగరంలోని పార్కులన్నింటిలో ఆహ్లాదకరమైన పార్కుగా మారుతుందని పశ్చిమ నియోజకవర్గ వాసులు భావించారు. అయితే రెండేళ్లలో కొత్త కొత్త ప్రతిపాదనలు తెరపైకి వస్తున్నాయే తప్ప అవి కార్యరూపంలోకి మాత్రం రావడం లేదు. గడిచిన మూడేళ్లుగా పార్కులో నిత్యం ఏదో ఒక మరమ్మతు పనులు జరుగుతూనే ఉన్నాయి. రెండేళ్ల కిందట కేఎల్‌రావు పార్కు అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్‌ను సైతం రూపొందించారు. పార్కులో చక్కటి ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని అందరూ భావించారు. ఇదిలా ఉండగా నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఈ నెల 4వ తేదీన ఈ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేఎల్‌రావు పార్కులో యాంఫీ థియేటర్ ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని కల్పిస్తామని చెప్పారు. థీమ్ పార్కుగా చేస్తున్న అభివృద్ధి పనులు పూర్తి కాకుండానే మరో కొత్త ప్రతిపాదన తెరపైకి రావడంతో పార్కు అభివృద్ధిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కేఎల్ రావు పార్కులో థీమ్ పార్కు అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్న వేళ తాజాగా కమిషనర్ నోటి వెంట వచ్చిన యాంఫీ థియేటర్ ప్రతిపాదన ఏ మేరకు కార్యరూపం దాల్చుతుందోనని పశ్చిమ నియోజక వర్గ ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇండోర్ స్టేడియంకు బుడమేరు ముంపు

థీమ్ పార్కులో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఇటీవల పూర్తయ్యాయి. ముఖ్యంగా పార్కులో వాకింగ్ ట్రాక్‌తో పాటు వాటర్ ఫౌంటేన్, అత్యాధునిక టాయిలెట్స్‌తో పాటు అవుట్‌డోర్ జిమ్ నిర్మాణం పనులు పూర్తయ్యాయి. రూ.కోటి వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియం గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన బుడమేరు ముంపు కారణంగా దెబ్బతింది. ఇండోర్ స్టేడియం మరమ్మతు పనులు ప్రారంభం కాగా త్వరలోనే పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. సందర్శకుల ఆహ్లాదం కోసం, చిన్న పిల్లల కోసం ఆట పరికరాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పశ్చిమలో ఉన్న ఏకైక పార్కు ఇదే...

పశ్చిమ నియోజక వర్గ ప్రజలకు ఆహ్లాదం కోసం ఉన్న ఒకే ఒక పార్కు కేఎల్‌రావు పార్కు. వన్‌టౌన్ వాసులకు అందుబాటులో ఉన్న కేఎల్‌రావు పార్కులో గత రెండేళ్లుగా అభివృద్ధి పనులు సాగుతూనే ఉన్నాయి. నగరంలో ఏ పార్కులోనూ లేని బోటింగ్ సదుపాయం కేఎల్‌రావు పార్కుకు సొంతం కాగా మరమ్మతుల కారణంగా గత మూడేళ్లగా పార్కులో బోట్లలో విహరించే అవకాశం లేకుండానే పోయింది. ఇక పార్కుకు సాయంత్రం వేళ కుటుంబ సభ్యులతో విచ్చేసిన చిన్నారులు ఆడుకునేందుకు సరైన ఆట పరికరాలు అందుబాటులో లేవని సందర్శకులు నిరాశ చెందుతున్నారు.

పది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ



విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న శారద

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ (డీఎస్ఎంసీ) హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థినీ విద్యార్థులకు సాయంత్రం వేళలో ఉచితంగా అల్పాహార పంపిణీ కార్యక్రమం సోమవారం సాయంత్రం ప్రారంభమైంది. వాసవి క్లబ్ ఆఫ్ భవానీపురం విజయవాడ ఆధ్వర్యంలో పది పరీక్షలు పూర్తి అయ్యేవరకు 90 మంది విద్యార్థులకు 45 రోజులపాటు ప్రతి రోజూ సాయంత్రం సమయంలో అల్పాహారం అందజేయనున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మిత్తింటి శారద మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో చదువుకుంటూ సాయంత్రం పది పరీక్షల కోసం ప్రత్యేకంగా నిర్వహించే క్లాసులకు హాజరయ్యే విద్యార్థులు సహజంగానే అలసిపోతారని, అటువంటి వారికి అల్పాహారం ఎంతైనా అవసరమని అన్నారు. వాసవి క్లబ్ ఆఫ్ భవానీపురం చేపట్టిన ఈ కార్యక్రమానికి తొలి రోజు దాతగా సహకరించటం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మాతంగి కోటయ్య మాట్లాడుతూ ప్రతిభ ఉన్న చోట తప్పనిసరిగా ప్రోత్సాహం ఉంటుందని అన్నారు. వాసవి క్లబ్ ఆఫ్ భవానీపురం అధ్యక్షుడు విస్సంశెట్టి కిరణ్ కుమార్ మాట్లాడుతూ రానున్న పది పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అప్పుడే ఈ ఉచిత అల్పాహార పంపిణీ కార్యక్రమానికి సార్థకత ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ సీనియర్ సభ్యులు దేసు వెంకట శివప్రసాద్, జూలూరి శివ, ఉపాధ్యాయులు సీహెచ్‌వీఎస్‌వీ ప్రసాద్, కె.జ్యోతిర్మయి, కె.శివ పార్వతి, జె.భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినీనటి నిధి అగర్వాల్ సందడి



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సినీ నటి నిధి అగర్వాల్ సోమవారం సత్యనారాయణపురంలో సందడి చేశారు. ఎన్ఆర్‌పీ రోడ్డులోని ఓ జ్యూయలరీ షోరూమ్ ప్రారంభోత్సవానికి ఆమె విచ్చేశారు. అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు. ఈ సందర్భంగా అభిమానులతో కొద్ది సేపు ఆమె మాట్లాడారు. విజయవాడ నగరం అంటే తనకెంతో ఇష్టమని అన్నారు. పవన్ కళ్యాణ్‌తో హరిహర వీరమల్లు, ప్రభాస్‌తో రాజా సాబ్ చిత్రాల్లో హీరోయిన్‌గా నటిస్తున్నానని చెప్పారు.

క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన పెంచుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కంప్యూటర్ రంగ విద్యార్థులు క్లౌడ్ కంప్యూటింగ్‌పై మరింత అవగాహన పెంచుకోవాలని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ట్రైనర్ సీహెచ్ రామకృష్ణ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎంసీఏ విభాగం, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్ అంశంపై ఆరు రోజుల వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ క్లౌడ్ కంప్యూటింగ్ అంటే ధరను చెల్లించి భౌతిక డేటా కేంద్రాలను, సర్వర్‌లను వినియోగించుకోవటమన్నారు. ఏడబ్ల్యూఎస్ వంటి క్లౌడ్ ప్రొవైడర్ నుంచి అవసరమైన ప్రాతిపదికన కంప్యూటింగ్ శక్తి, నిల్వ, డేటాబేస్‌ల వంటి సాంకేతిక సేవలను పొందవచ్చన్నారు. ఇటీవల క్లౌడ్ కంప్యూటింగ్ బాగా విస్తరిస్తోందని, దానిపై మరింత అవగాహన చేసుకోవటం ద్వారా ఈ రంగంలో మరింత రాణించేందుకు అవకాశముంటుందని వివరించారు. అనంతరం రామకృష్ణను కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సు, దీర్ కోశాధికారి కె.రాఘవయ్య సత్కరించారు.

కమనీయం శ్రీవారి కల్యాణోత్సవం

నేత్రపర్వంగా గజవాహనోత్సవం



కల్యాణోత్సవానికి హాజరైన ఉభయదాతలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి కల్యాణోత్సవం సోమవారం రాత్రి కమనీయంగా జరిగింది. స్వామి వారి సన్నిధిలో ఈ నెల ఏడు నుంచి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, సంకీర్తనలు, భక్తుల హరినామస్మరణలు, పండితుల వ్యాఖ్యానాల మధ్య స్వామివారు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను వివాహమాడిన దృశ్యాన్ని చూసి భక్తులు పులకించారు. ఆలయ ప్రాంగణంలో చూడముచ్చటగా ఏర్పాటు చేసిన కళావేదికపై ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి ఆలయ ప్రధానార్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కంకణధారణ, యజ్ఞోపవీత సమర్పణ, మహాసంకల్పం తదితర కార్యక్రమాలతో ఉత్సవమూర్తులను కల్యాణోత్సవానికి సిద్ధం చేశారు. అనంతరం జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు సమర్పణ తదితర ఘట్టాలను ఒకదాని తరువాత ఒకటిగా ప్రముఖ ఆగమ పండితుల పర్యవేక్షణలో ప్రధానార్చకుడు శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు. వివిధ మహిళా బృందాలు కీర్తనలను హృద్యంగా ఆలపించారు. ఈ కల్యాణోత్సవంలో పలువురు దంపతులు ఉభయదాతలుగా పాల్గొని ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా పారమాత్మిక హోమం

ఆలయ ప్రాంగణంలో ఉదయం స్వామివారి పారమాత్మిక హోమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. పండితుల ఆధ్వర్యంలో పలువురు రుత్వికులు భక్తులతో హోమాన్ని నిర్వహింపజేశారు. అనంతరం లక్ష గులాబీల అర్చనను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో ఉభయదాతలు ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ గుడిపాటి పాపారావు నిర్వహించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాన్‌పై విస్తృత చర్యలు చేపట్టాలి

అధికారులకు నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతమైన చర్యలు చేపట్టాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ శాఖాధిపతులతో సోమవారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో మూడు సర్కిళ్ల పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాన్‌పై విస్తృతమైన అవగాహన కల్పించాలని, దానికనుగుణంగా వినియోగదారులను గుర్తించి వారితో ఒక సమావేశం నిర్వహించాలన్నారు. విజయవాడ నగరంలో 120 మైక్రోన్స్ కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ వాడకాన్ని వీఎంసీ పూర్తిగా నిషేధించిందని, ఈ విషయాన్ని మరోమారు వినియోగదారులకు, వ్యాపారస్తులకు గుర్తుచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, సూపరింటెండెంట్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, పట్టణ సాధికార విభాగం(యూసీడీ) ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.వెంకటనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, సీడీవోలు పాల్గొన్నారు.

కొత్తపేటకు ఎస్‌హెచ్‌వో కావలెను!

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విజయవాడ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అత్యంత కీలకమైన కొత్తపేట పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వో అవసరం ఏర్పడింది. కొత్తపేట పోలీస్ స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న చిన కొండలరావు శనివారం నుంచి విధులకు హాజరు కావడం లేదు. నాలుగు నియోజక వర్గాల పరిధులు ఉన్న కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించడం కత్తి మీద సామే.. విధి నిర్వహణలో బాధితులకు అండగా ఉన్నారనే కారణంతో ఎమ్మెల్యే వ్యవహరించిన తీరు, పోలీసు అధికారుల వ్యవహార శైలితో ఒత్తిళ్లకు గురై సెలవు పెట్టారని ప్రచారం జరుగుతోంది. అయితే వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నా... కృష్ణాజిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే తీరు కారణంగానే మనస్తాపానికి గురైన సీఐ ఉన్నతాధికారులెవరికీ చెప్పకుండా జీప్‌ను స్టేషన్ వద్ద వదిలి, సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. తొలుత ఒకటి, రెండు రోజులలో అంటే సోమవారానికి తిరిగి విధులకు విచ్చేస్తారని అధికారులు భావించారు. అయితే సోమవారం కూడా సీఐ కొండలరావు విధులకు హాజరు కాకపోవడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. దీనికి తోడు ఓ ఎస్ఐ స్టేషన్ వద్ద ఉన్న సీఐ జీప్‌లో సోమవారం చక్కర్లు కొట్టడం విమర్శలకు దారి తీస్తోంది. ఎస్ఐలు మొదలు, పోలీసు, హోంగార్డు సిబ్బంది సైతం కొండలరావు మాట వినడం లేదని, కనీసం విధి నిర్వహణలో సహకరించకపోవడం కూడా సీఐ మనస్తాపానికి కారణంగా చెబుతున్నారు. నగరానికి చెందిన ఓ ఉన్నతాధికారి సీఐ కొండలరావును సాగనంపేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ సాగుతోంది. మరో వైపున కొత్తపేట స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వో లేకపోవడంతో స్టేషన్‌లో రూరల్ పరిధి సెక్టార్‌కు విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ స్టేషన్ అంతా తానై పాలన సాగిస్తున్నారు. ఈ ఎస్ఐ కొత్తపేటకు వచ్చినప్పటి నుంచి ఆయనపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూరల్ పరిధిలో కోడి పందేలు, పేకాట శిబిరాలు మొదలు మట్టి తోలకాల వరకు అంతా ఆయన కనుసన్నల్లోనే జరుగుతోందని స్టేషన్‌లో ప్రచారం సాగుతోంది.

పీఎం సందేశాలను ఆకళింపు చేసుకోండి

- విద్యార్థులకు ఎస్‌బీఐ అధికారి ప్రసాద్ సూచన
- 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న విద్యార్థులు



ప్రధాని మోదీ పరీక్ష పే చర్చ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో ఎస్‌బీఐ అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): యువతకు ఒత్తిడి లేని వాతావరణాన్ని అందించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకంలో ఆయన ఇచ్చిన సందేశాలను విద్యార్థులు ఆకళింపు చేసుకుని అనుసరించాలని భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చీఫ్ మేనేజర్ వీకే డీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్య అకాడమీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో సోమవారం ప్రధాని మోదీ ప్రారంభించి పాల్గొన్న 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో వర్చువల్‌గా విద్యార్థులు పాల్గొన్నారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలను విద్యార్థులు ఆసక్తిగా ఆలకించి నోట్ చేసుకున్నారు. అనంతరం ఎస్‌బీఐ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ ఎగ్జామ్ వారియర్స్‌లో ప్రధాని మోదీ పేర్కొన్న సందేశాలు కేవలం విద్యార్థులకే కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కూడా ఆచరణాత్మకం అని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజియన్-1, 2, 3 హెచ్‌ఆర్ మేనేజర్లు రవిప్రసాద్, పవన్ కుమార్, కుమార్ రామకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమాన్ని డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు రొంపిచర్ల సత్యనారాయణ, రేమల్లె గోపాలం, దారా నాగేశ్వరరావు, సంగీతరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తరుణ్ బాబు నిర్వహించారు.

ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



దివాకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాబూరావు, సీపీఎం నాయకులు

వించిపేట(విజయవాడపశ్చిమ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు కురిపిస్తూ సామాన్యులపై భారాలను మోపుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. వించిపేట, ఖాదర్‌సెంటర్‌లో సోమవారం సీపీఎం మాజీ నగర కార్యదర్శి పి.దివాకర్ 21వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న బాబూరావు దివాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కార్మిక నాయకుడిగా, సీపీఎం సీనియర్ నాయకుడిగా తాను నమ్మిన సిద్ధాంతం కోసం కడ వరకు పోరాడిన దివాకర్ స్ఫూర్తిని నేటితరం ముందుకు తీసుకెళ్లాలని తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు లాభాలు తెచ్చే విధంగా రాయితీలు కల్పిస్తూ సామాన్యులపై భారాలను పెంచేలా ఉన్న కేంద్ర బడ్జెట్‌ను ప్రజలందరూ వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి బి.సత్తిబాబు, పశ్చిమ నగర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఆదిలక్ష్మి, నగర కమిటీ సభ్యులు ఎం.కొండారెడ్డి, పి.రాజు, కరిముల్లా, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో శాతవాహన పరుగులు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల భద్రత, సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ట్రాక్‌లు, కోచ్‌ల ఆధునికీకరణ దిశగా రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. గతంలో ఉండే ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో అత్యాధునిక ఎల్‌హెచ్‌బీ (లింక్ హాఫ్‌మన్ బుష్) కోచ్‌లను ప్రవేశపెట్టింది. అందులో భాగంగానే ఇప్పటివరకు విజయవాడ - సికింద్రాబాద్ మధ్య నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్ (12713/12714) రైలును ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో అప్‌గ్రేడ్ చేసింది. ఈ కోచ్‌లలో ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా ఇంటీరియల్, కుషనింగ్ సీట్లు, కుదుపులు లేకుండా ఎయిర్ సస్పెన్షన్ సిస్టం, విశాలమైన కిటికీలను ఏర్పాటు చేసింది. పెరుగుతున్న రైళ్ల వేగాన్ని తట్టుకుని సున్నితమైన ప్రయాణ అనుభూతి కల్పించేలా సాంకేతిక పరిజ్ఞానం ఈ కోచ్‌లలో ఉన్నాయి. యాంటి క్లైంబింగ్, క్రాష్ వర్తినెస్ టెక్నాలజీతో పట్టాలు తప్పే ప్రమాదాలను నివారించేలా ఈ కోచ్‌లను అధునాతన భద్రత ప్రమాణాలతో రూపొందించారు. ఈ కోచ్‌లోని హాట్ బఫే కారు పూర్తిగా ఎయిర్ కండిషనింగ్, ఇండక్షన్ ఫ్లేమ్ కుకింగ్ ఇన్‌స్టాల్ చేశారు. ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఆటోమెటిక్ ఫైర్ డిటెక్షన్, సప్రెషన్ సిస్టంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ శాతవాహన ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు అందుబాటులో రావటంతో ప్రయాణికులు సురక్షితంగా, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని పొందుతారన్నారు. రానున్న రోజుల్లో రైలు ప్రయాణికులకు భద్రత, సౌకర్యాలపై కొత్త టెక్నాలజీలతో అప్‌గ్రేడ్ దిశగా రైల్వే సేవలు కొనసాగనున్నట్లు వివరించారు.

కరుణామూర్తి ఒడి.. భక్తజన సవ్వడి

విశ్వాస శిఖరం భక్తులతో పోటెత్తింది. కొండ దిగువ నుంచి ఎగువన కొండ గుహలోని లూర్దుమాత విగ్రహం వరకూ.. ఆ పైన సిలువ వరకూ కిక్కిరిసింది. విశ్వాసుల ప్రార్థనలు, మొక్కుబడులు, దీపారాధనలు.. గురువుల సమష్టి దివ్యబలిపూజలు, దివ్య సత్ప్రసాదాలతో కొండంతా భక్తిభావం ప్రసరించింది. మేరీమాత తిరునాళ్లలో రెండో రోజు సోమవారం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మా వందనం.. మరియమ్మా వందనం.. మా కోసం నీ ప్రియసుతుని వేడమ్మా అంటూ భక్తులు ప్రార్థించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ
















సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్ :
✆ 90102 10386
Office mail : sakshiads@gmail.com